క్లుప్తంగా

గౌతు లచ్చన్న సేవలు స్ఫూర్తిదాయకం



లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వాసుదేవరావు, తదితరులు

డాబాగార్డెన్స్: గౌతు లచ్చన్న సేవలు స్ఫూర్తిదాయకమని విశాఖపట్నం జిల్లా శ్రీశయన కుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు తోట వాసుదేవరావు కొనియాడారు. స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ పాలకులను ఎదురించి పోరాడిన సమరయోధుడని, బడుగు, బలహీన వర్గాలకు లచ్చన్న అందించిన సేవలు ఎనలేనివన్నారు. గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్భంగా జడ్జి కోర్టు సమీపాన గల విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వాసుదేవరావు మాట్లాడుతూ గౌతు లచ్చన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని తాము ఎప్పటి నుంచో వేడుకుంటున్నామని, ప్రభుత్వం స్పందించి కార్యరూపంలోకి తెచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పలాస కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఆ జిల్లాకు లచ్చన్న పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మద్ది ప్రసాద్, తోట శేఖర్, బొంగు సత్తిరాజు, గడ్డి తిరుపతిరావు, తోట హరికృష్ణ, జె.రమణ, కె.రవి, దొంపాక భాస్కర్, వెంకటరమణ, తోట హరిశంకర్, ఎం.చిట్టిబాబు, పైలా నాగేశ్వరరావు, జలుమూరి చిట్టిబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.


ఎస్సీ వర్గీకరణ రద్దు చేసే వరకు పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న రత్నాకర్

డాబాగార్డెన్స్: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణతో దళితుల ఐక్యతపై దేశ వ్యాప్తంగా రాజకీయ కుట్ర జరుగుతోందని, వర్గీకరణను రద్దు చేసే వరకు పోరాడుతామని రాక్స్ అండ్ మాల మహానాడు నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ రత్నాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతో దళితుల ఐక్యతపై దేశ వ్యాప్తంగా మోదీ, బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కుట్రలో భాగస్వామి చంద్రబాబునాయుడు మాల సామాజిక వర్గంపై పగబట్టి తొక్కేసే ప్రయత్నాన్ని తన భుజాన వేసుకుని నడిపిస్తున్నాడని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గంపై తెలుగు రాష్ట్రాల్లో కక్ష గట్టాయన్నారు. కులం, మతాన్ని రెచ్చగొట్టి, ఈ దేశాన్ని విభజించి, అమ్ముకునే పనిలో పడ్డారన్నారు. మోదీ, గుజరాతీ పరివారం మొత్తం ఎన్నికల కమిషన్‌ను పావుగా వాడుకుని దొంగతనంగా గెలిచి, పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. దేశంలో అన్ని రాజ్యాంగ వ్యవస్థలను మోదీ నిర్వీర్యం చేశారని, దమ్ముంటే ఎన్నికలు రద్దు చేసి, బ్యాలెట్ పేపర్‌తో గెలిచి, సామర్థ్యాన్ని నిరూపించుకోవాలన్నారు. అపూర్వ సహోదరులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి ఇద్దరూ మాల సామాజిక వర్గంపై సాధిస్తున్న కక్ష సాధింపు విషయంలో ఇకనైనా పునరాలోచించాలని సూచించారు. తెలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎస్సీ వర్గీకరణ తాత్కాలికం మాత్రమేనని, పోరాటం కొనసాగుతుందన్నారు. సెప్టెంబర్ ఒకటి నుంచి ఉద్యమం గ్రామ గ్రామన చేపడతూ మరింత ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో గొల్ల ఈశ్వరరావు, మత్తి రత్నారావు, గొడుగు రాజు, సిమ్మాల దుర్గాప్రసాద్, శ్యామలరావు, నెల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు



శ్రీవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలోని మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయం (టీటీడీ)లో శనివారం శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ముందుగా ఇక్కడికి చేరుకున్న భక్తులు శ్రీవారి పాదాల వద్ద పూజలు నిర్వహించిన అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని పద్మావతి, గోదాదేవి, ఆంజనేయ స్వామి వార్లకు భక్తులు పూజలు చేశారు. సాయంత్రం శ్రీవారి నామ సంకీర్తనలు, కోలాటాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

కొండవాలు వాసులకు రేషన్ కష్టాలు



- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటింటికీ సరకుల పంపిణీ
- కూటమి పాలనలో వాహనాల తొలగింపుతో ఇబ్బందులు
- కొండవాలు ప్రాంతాలకు దూరంగా రేషన్ డిపోలు
- అందుబాటులో ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్

ఆరిలోవ: కొండవాలు ప్రాంతాల ప్రజలకు రేషన్ కష్టాలు మొదలయ్యాయి. రాష్ట్రంలో 2019 నుంచి 2024 వరకు అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రేషన్ డిపోలకు బదులుగా వాహనాలు ఏర్పాటు చేశారు. ఆ వాహనాలు అన్ని కాలనీలకు వెళ్లి సరకులు అందించేవి. ఇంటి వద్దకే వచ్చిన వాహనం నుంచి ప్రజలు సరకులు తీసుకునేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రేషన్ వాహనాలను నిలిపేశారు. మళ్లీ రేషన్ డిపోలకే ప్రజలు వెళ్లి సరకులు తీసుకునే విధానం తీసుకొచ్చారు. దీంతో ప్రజలకు ఇబ్బందులు మొదలయ్యాయి. అందులోనూ కొండవాలు ప్రాంతాల్లో నివసించే వారికి మరిన్ని ఇక్కట్లు ఎదురవుతున్నాయి.

పది వేల మందికి నాలుగే డిపోలు

హనుమంతవాక నుంచి పెదగదిలి, చినగదిలి మీదుగా దీన్‌దయాల్‌పురం వరకు సుమారు మూడు కిలోమీటర్లకు పైగా కొండవాలు ప్రాంతం ఉంది. ఆ ప్రాంతంలో 10 వేలకు పైగా నివాసాలున్నాయి. అందులో ప్రస్తుతం 4 వేల వరకు తెల్లరేషన్ కార్డుదారులున్నారు. వారందరూ సరకులు తీసుకోవడానికి ప్రస్తుతం ఇబ్బంది పడుతున్నారు. ఇంత ఎక్కువ మంది నివసించే ప్రాంతంలో నాలుగు రేషన్ డిపోలు మాత్రమే ఉన్నాయి. మైదాన ప్రాంతంలో అయితే ఆ నాలుగూ సరిపోతాయి. ఇక్కడ మాత్రం కొండ మీద ఎక్కువ నివాసాలున్నాయి. వారంతా కిందన ఎక్కడో ఉన్న రేషన్ డిపోకు కొండ పైనుంచి వచ్చి సరకులు తీసుకెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. సంజయ్‌గాంధీ కాలనీలో 2 డిపోలు, పెదగదిలి వద్ద ఒకటి, చినగదిలిలో ఒక రేషన్ డిపో ఉన్నాయి. హనుమంతవాక, విజయదుర్గాకాలనీ, క్రాంతినగర్ ప్రాంతాల నుంచి రేషన్ కోసం సంజయ్‌గాంధీ కాలనీకి సుమారు ఒక కిలోమీటరు దూరం కొండ పైనుంచి ఆయా డిపోలకు రావాలి. పెదగదిలి డిపోకు సింహగిరికాలనీ, పెదగదిలి, సాలిపేట వరకు కొండవాలు నుంచి సరకుల కోసం వెళ్లాల్సి వస్తోంది. చినగదిలిలో ఉన్న డిపోకు లలితానగర్, దీన్‌దయాల్‌పురం కొండవాలు ప్రాంతాల ప్రజలు సుమారు కిలోమీటరు దూరం నడిచి వెళ్లాల్సి వస్తోంది. దీంతో రేషన్ సరకులు కోసం వెళ్లడానికి వ్యయప్రయాసలు పడాల్సి వస్తోందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత దూరం నుంచి వెళ్లినా కొన్నిసార్లు బియ్యం అయిపోవడంతో ఆరిలోవలో ఉన్న వేరే డిపోలకు వెళ్లండని డీలర్లు సూచిస్తున్నారని అంటున్నారు. పౌర సరఫరాల విభాగం అధికారులు స్పందించి కొండవాలులో నివసించే వారికి ప్రాంతాల వారీగా దగ్గరగా ఉండేలా డిపోలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఊరు ఇక్కడ.. రేషన్ డిపో అక్కడ..

''రేషన్ డిపో ఎక్కడో ఉంది.. మా ఊరు ఇక్కడ ఉంది.. సరకుల కోసం ఆటోల్లో రెండు కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న రేషన్ డిపోకి వెళ్లాల్సి వస్తోంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఐదేళ్లపాటు ఇంటి వద్దే సరకులు తీసుకునేవాళ్లం. ఇప్పుడు మళ్లీ దూరంగా దారపాలెంలో ఉన్న రేషన్ డిపోకి వెళ్లాల్సి వస్తోంది'' అంటూ రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాకు మళ్లీ తిప్పలు మొదలయ్యాయంటూ తలలు పట్టుకొంటున్నారు.

రెండు కిలోమీటర్ల దూరంలో డిపో

విశాఖ తూర్పు నియోజకవర్గంలో జీవీఎంసీ 13వ వార్డు పరిధి రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, ఎస్ఎస్ఎన్ నగర్ వాసులకు రేషన్ డిపో తలనొప్పిగా మారింది. ఆయా గ్రామస్తులు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని దారపాలెంలో ఉన్న రేషన్ డిపోకు వెళ్లాల్సి వస్తోంది. ఆయా గ్రామాలతోపాటు పైనాపిల్‌కాలనీ, దారపాలెం గ్రామస్తులకు చెందిన సుమారు 1,300 రేషన్ కార్డుదారులున్నారు. ఆయా కార్డుదారులు అందరికీ దారపాలెంలో రేషన్ డిపో మాత్రమే అందుబాటులో ఉంటుంది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారంతా సరకులు తీసుకోవడానికి దూర ప్రాంతానికి వెళ్లే తిప్పలు తప్పాయి. ఇంటి వద్దకే వాహనం రావడంతో ప్రశాంతంగా సరకులు తీసుకునేవారు. సుమారు ఐదేళ్లపాటు వారికి సమస్య లేకుండాపోయింది. ఏడాది కిందట కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ఏడాది జూన్ నుంచి మళ్లీ పాత సమస్య తలెత్తింది. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రేషన్ డిపోకు సరకుల కోసం ఆటోల్లో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఆటోలో వెళ్లి రావడానికి మనిషికి రూ.20 ఖర్చు అవుతుందని, జనం ఎక్కువగా ఉంటే రెండోసారి మళ్లీ వెళ్లాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సింహగిరి కాలనీ నుంచి పెదగదిలి వైపు కొండవాలు ప్రాంతం

సమీపంలో ఏర్పాటు చేయాలి



కొండవాలు పైనుంచి రేషన్ సరకుల కోసం కిందకు దిగి కొంత దూరం వెళ్లాల్సి వస్తోంది. హనుమంతవాక కొండ పైనుంచి సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న సంజయ్‌గాంధీ కాలనీలో రేషన్ డిపోకు రావాల్సి వస్తోంది. ఎంత మంది జనం ఉన్నా గంటల తరబడి సరకులు కోసం నిరీక్షించాల్సి వస్తోంది. కొండవాలు ప్రాంతాల వారి కోసం దగ్గరలో ఉండేటట్లు రేషన్ డిపోలు ఏర్పాటు చేయాలి.

– సీహెచ్ పార్వతి, సింహగిరి కాలనీ

ఆటోల్లో వెళ్లాల్సి వస్తోంది



మా గ్రామస్తులందరూ రెండు కిలోమీటర్ల దూరంలోని దారపాలెంలోని రేషన్ డిపో నుంచి సరకులు తీసుకోవాలి. సరకుల కోసం దారపాలెం వెళ్లడానికి గతంలో ఇబ్బంది పడేవాళ్లం. జగన్ ప్రభుత్వంలో మా గ్రామానికే వాహనం రావడంతో ఇంటి ముందే బియ్యం, సరకులు తీసుకునేవాళ్లం. కూటమి ప్రభుత్వంలో మళ్లీ దారపాలెం డిపోకు వెళ్లడానికి ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. దూరం కావడంతో ఒంటిరిగా వెళ్లలేక ఇద్దరు ముగ్గురం కలిసి వెళ్లాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి మా గ్రామానికి అందుబాటులో మరో రేషన్ డిపో ఏర్పాటు చేయాలి.

– ఎం.లక్ష్మి, రామకృష్ణాపురం

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు



జీవీఎంసీ 23వ వార్డు 254వ నంబరు బూత్ పరిధిలో కరపత్రాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, నాయకులు

మద్దిలపాలెం: రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులే టార్గెట్‌గా చంద్రబాబు పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెంలోని 254వ నంబరు బూత్ పరిధిలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం వార్డు అధ్యక్షుడు బూస రమణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లి అప్పారావు గడప గడపకు వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించి, కరపత్రాలు అందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అభివృద్ధిని, సంక్షేమాన్ని పక్కన పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేయించడమే పరిపాలనగా భావించడం చాలా దురదృష్టకరమన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్, లోకేష్ ఇచ్చిన అబద్ధపు హామీలతో మోసపోయిన ప్రతి ఒక్కరూ కూటమి ప్రభుత్వం గద్దె దిగేవరకు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు పరిశీలకులు బోర కుమార్ రెడ్డి, పులగం సూర్యనారాయణ రెడ్డి, నగిరెడ్ల పోలిశెట్టి, పులగం కొండా రెడ్డి, ఎంరెడ్డెల్ల ఈశ్వర్ రెడ్డి, పులగం శ్రీనివాస రెడ్డి, బోర రామిరెడ్డి, పిలక మధుసూదన రెడ్డి, గుడ్ల నర్సింగరావు రెడ్డి, అచ్చి సుధీర్ రెడ్డి, బోస రమణ రెడ్డి, సాడి లక్ష్మణ రెడ్డి, బోయి త్రినాథ్ రెడ్డి, చిల్లా నారాయణరావు రెడ్డి, ఎరుసు అరుణ, గుడ్ల త్రినాథ రెడ్డి, కారపురెడ్డి దుర్గా శ్రీనివాస్, అవ్వ నర్సింగరావు, పుట్ట రమణమ్మ, గుమ్మడి మణి, సాల చిన్ని, పద్మ, బూర సూరమ్మ, సీరపు రామలక్ష్మి, బోయి శ్రీను రెడ్డి, బోయి రమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌరులందరికీ ఓటు హక్కు కల్పించాలి

- బిహార్‌లో 65 లక్షల ఓట్ల తొలగింపు అన్యాయం
- ధర్నాలో సీపీఎం, సీపీఐ నాయకులు



నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు, సభ్యులు

బీచ్‌రోడ్డు: దేశంలో ప్రజాస్వామ్యం, ప్రజల ఓటు హక్కు ఖూనీని కేంద్ర ప్రభుత్వం ఆపాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శనివారం నిరసన ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే రెహమాన్ మాట్లాడుతూ బిహార్‌లో ఎన్నికల కమిషన్ 65 లక్షల ఓట్లు తొలగించడం ప్రజాస్వామ్యాన్ని హరించడమే అన్నారు. ఆధార్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు చెల్లుబాటు కావని చెప్పడం, ఓటరే పౌరసత్వాన్ని నిరూపించుకోవాలని చెప్పడం దారుణమన్నారు. ఈసీ జారీ చేసిన ఓటర్ గుర్తింపు కార్డుతో దశాబ్దాలుగా ఓట్లు వేస్తున్న వారికి, ఇప్పుడు ఆ గుర్తింపు కార్డు చెల్లుబాటు కాదని ప్రకటించడం సరికాదన్నారు. ఈ అక్రమ నిబంధనలు రద్దు చేయాలని, పౌరులందరికీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాజ్యాంగ వ్యవస్థలపై దాడి చేసి, దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఈడీ, సీబీఐలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకోవడం తీవ్రం చేసిందన్నారు. స్వతంత్రంగా వ్యవహరిస్తూ, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందని... కేంద్ర ప్రభుత్వ తీరుతో ఈసీ స్వతంత్రంగా వ్యవహరించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఎన్నికల వ్యవస్థను కూడా తమకు అనుకూలంగా మార్చుకుని దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ లక్ష్యం ప్రకారం దేశంలో అధ్యక్ష తరహా పాలనకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజల ఓట్ల తొలగింపు కేవలం బిహార్, కర్ణాటక, మహారాష్ట్రకే పరిమితం కాదని, దేశ వ్యాప్తంగా ఇటువంటి అక్రమాలకు పాల్పడతారన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలంతా నడుము బిగించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు పి.మణి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తున్న బీజేపీ పాలనను ప్రజలు తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు వి.కృష్ణారావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, బి.జగన్, బి.ఈశ్వరమ్మ, ఎం.సుబ్బారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు క్షేత్రపాల్ రెడ్డి, ఎం.మన్మధరావు, ఎం.రాంబాబు, కె.వనజాక్షి పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీకృష్ణ జన్మాష్టమి

- రాధా మదన్‌మోహన్‌ల విగ్రహాలకు పుష్పాభిషేకం
- సప్తనదుల జలాలతో విశేషంగా అభిషేకం



సప్తనదుల జలాలతో రాధాకృష్ణులకు అభిషేకం చేస్తున్న దృశ్యం



ఉత్సవాల్లో శ్రీకృష్ణ సేవా సంఘం సభ్యులు



పాత ఆరిలోవలో శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న మాజీ మేయర్ హరి వెంకటకుమారి



రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు



పెదగదిలిలో శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న యువజన సేవా సంఘం సభ్యులు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో డాక్టర్ నిష్కించిన భక్తిదాస పర్యవేక్షణలో గత రెండు రోజులుగా ఈ వేడుకలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గాదిరాజు ప్యాలెస్‌లో వేసిన భారీ సెట్‌లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సప్తనదుల జలాలు, పంచామృతం, పండ్ల రసాలతో 108 పవిత్ర జల కలశాలతో అభిషేకం నిర్వహించారు. బృందావనం నుంచి వచ్చిన లడ్డు గోపాలునికి మృదువైన ఉయ్యాల సేవ చేశారు. ఉయ్యాల సేవలో నగర మేయర్ పీలా శ్రీనివాస్, మాజీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కలెక్టర్ హరేందిర ప్రసాద్ పాల్గొన్నారు. 108 రకాల వంటకాలను రాధాకృష్ణులకు నివేదించారు. రాత్రి వేడుకల్లో భాగంగా భారీ కేక్‌ను భక్తుల సమక్షంలో కట్ చేశారు. సంగీత కళాకారులచే సామూహిక భజగోవిందం, 108 సార్లు హరినామ జపం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 వరకు భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాత ఆరిలోవ, తోటగరువు, పెదగదిలి, చినగదిలి ప్రాంతాల్లో పందిర్లు, మండపాలు ఏర్పాటు చేశారు. వాటిలో ఏర్పాటు చేసిన రాధాకృష్ణులకు స్థానికులు పూజలు చేశారు. పలు యాదవ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలతో ఆయా ప్రాంతాల్లో సందడి నెలకొంది. ఈ సందర్భంగా భక్తులతోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు రాధాకృష్ణులకు పూజలు చేశారు. పాత ఆరిలోవలో శ్రీయశోద బాల గోపాల యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైఎస్సార్ సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. తోటగరువులో రుక్మిణి సత్యబామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నియోజవకర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, స్థానిక నాయకులు శ్రీకృష్ణుడిని దర్శించుకుని పూజలు చేశారు. పెదగదిలిలో శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు.

ఎంవీపీ కాలనీ: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఎంవీపీ కాలనీలోని శ్రీసత్యసాయి విద్యా విహార్ విద్యార్థులు రాధాకృష్ణుల వేషధారణలో అలరించారు. బాలగోపాలుడు, రాధ వేషధారణలో కృష్ణాష్టమి వేడుకలకు తరలివచ్చారు. కొందరు విద్యార్థులు బలరాముడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. శ్రీకృష్ణా ముకుంద మురారి పాటకు నృత్యాలు చేశారు. ఆనందోత్సాహాల మధ్య సాంప్రదాయ వస్త్రధారణతో ఉట్టి కొట్టారు.

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెం సమీప పీతలవానిపాలెంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, శ్రీకృష్ణ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్ : జీవీఎంసీ 28వ వార్డు పితాని దిబ్బలో కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. గోకుల యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉట్టికొట్టే వేడుకలను వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు ప్రారంభించారు. వేడకల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.



ఉట్టికొట్టే వేడుకలో వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, తదితరులు



కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారి

నేటి నుంచి ఖేల్‌కూద్ పోటీలు



మాట్లాడుతున్న ఏయూ మాజీ వీసీ నాగేశ్వరరావు

ఆరిలోవ: విద్యాభారతి ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి విశాలాక్షినగర్‌లో రాష్ట్రస్థాయి ఖేల్‌కూద్ పోటీలు నిర్వహించనున్నట్లు బీవీకే చైర్మన్, ఏయూ మాజీ వీసీ గొల్లపల్లి నాగేశ్వరరావు తెలిపారు. విశాలాక్షినగర్‌లోని బీవీకే కళాశాల వాల్మీకి భవనంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాలాక్షినగర్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో మూడు రోజులపాటు పోటీలు జరగనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచినవారు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించే ప్రతిష్ఠాత్మక క్రీడల్లో పాల్గొనడానికి అవకాశం లభిస్తుందన్నారు. విద్యా కేంద్రం కార్యదర్శి రామసత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో 180 మంది విద్యాలయాల నుంచి 700 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. వారిలో 6, 7, 8 తరగతుల వారిని బాలల కేటగిరీ, 9, 10 తరగతుల వారిని కిశోర్ కేటగిరీ, 11, 12 తరగతుల వారిని తరుణ కేటగిరీగా విభజించి పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. అథ్లెటిక్స్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, కబడ్డీ, ఖోఖో, చదరంగం, మాలకంబ్, యోగా పోటీల్లో విద్యార్థులు తలపడతారన్నారు. కార్యక్రమంలో బీవీకే ప్రతినిధులు కె.ఆర్.కె.సత్యనారాయణ, చక్రవర్తి పాల్గొన్నారు.